చిన్నకథ

# పొట్టగొడితే... పుట్టగతులుండవు రోయ్!

ఎలికట్టె శంకర్‌రావు

రొండెకరాల రేగడి నేలను మాత్తరం మా నాయిన యెప్పుడూ నిదుర బోనిచ్చెటోడు కాదు. ఓ యెకరంల బుడ్డశెనిగ, దనియాలు, నిర్వశేనని యేసెటోడు గని పొగాకు మాత్తరం కచ్చితంగా యెకరం యిడవకుంట యేసెటోడు.

పొగాకు పంట యేయటానికి దుక్కి దున్నిన కాన్నుంచి మా నాయిన ఆరాటం అంతా యింత వుండేది గాదు. మడికట్ల నారును బండి మీద యేసుకొని యింటి రాజులం రేగడికి పోయెటోళ్లం నాటేయటానికి.

ఆనాకాలమయినా నాటు పెట్టటానికి నీల్లేడ వుంటయ్? నాలుగు బిందెలు పట్టుకొని వో కోసు దూరం నడిసి పడెల- నీల్లగుంట- నీల్లు మోసెటోల్లం. మా అమ్మనాయిన మాత్తరం పొతంగ కోంద్రలేసి వున్న దుక్కిల లోటతోని లోటడు నీల్లు పోసుకుంట వొక్కొక్క మొక్కను నాటెటోల్లు మా జాగర్తగ. ఒంగీ లేసి ఆల్ల నడుములు తీపులు తీసేయి. బిందెల నీల్లు మోసీమోసీ మా మాడలు పచ్చి పుండ్లయ్యేయి. పొద్దూకేసరికి యెకరం నాటేసి పిట్ట పిల్లలోలిగ బండి మీద యెక్కి యిల్లు చేరెటోల్లం.

అది మొదలు మా నాయిన రోజూ రేగడికి పోయి రావాల్సిందే. ఆన బడ్డదా సరె లేకపోతే మొక్కలు వాడుపడుతున్నయని మల్లా బిందెలు తీసుకొని బండి యెక్కెటోల్లం.

పొగాకు చెట్లు జానెడెత్తు పెరిగినంక ఆకుల సందున పిలకలొచ్చేయి. ఆ పిలకలు కత్తిరియ్యటానికి మల్లా యెల్లేటోల్లం. పిలకలు కత్తిరించటం వొబంగినా అయ్యేది కాదు. ఒక్కొక్క ఆకు సందున జాగర్తగ కత్తిరియ్యాలంటె పానం మీదికి వొచ్చేది. మా నాయిన మునుం కదులుకుంటనే మా మీద వో కన్నేసి వుంచెటోడు. ఎవలన్నా వొక్క పిలక కమ్మర్తిల మర్సినా 'అగో ఆడ పిలకుంది. యెటు జూస్తున్నవ్‌రా? చేసే పనిమీద శెర్ద లేకపోతె యెట్లరా?' అని మెత్త మెత్తగనే నాలుగు అచ్చింతలేసెటోడు. అట్ల పిలకదీసి, కలుపుదీసి, బిందెలు మోసి వొల్లు కాయలు కాసేటట్లు యాస్టపడితేగాని శేతికి రాకపోయేది పంట.

ఏపుగా యెదిగిన శేనును కండ్లార జూసుకొని మా నాయిన బలే సంబూర పడెటోడు. సద్ద కంకుల మీద పిట్ట తిరిగినట్లు తిరిగెటోడు పొగాకు శేన్ల.

కోతకొచ్చినంక కొడవండ్లు అందుకొని వొంగి రొండు రోజులల్ల బండిమీద యేసుకొని వొచ్చెటోల్లం. ఇంటిముంగలున్న కొట్టంల కూసొని గాజంగి నారపోసలతో వొక్కొక్క కాడా కుచ్చి దోర్నాలు కుట్టెటోల్లం. అయిన దోర్నాన్ని అయినట్లు మా నాయిన కొట్టంల ఆరకట్టెటోడు.

మా నాయిన పానం సొంతం దొడ్లనే తిరిగేది. ఎప్పుడు జూసినా దోర్నాల సందున తిరుగుతనే వుంటోడు నీల్లు సల్లుకుంట. ఓ మూడు వారాలు అయినంక వొక్కొక్క దోర్నాన్ని దించి మండె కట్టెటోడు. ఇంగ మండె పక్కన్నే మంచం. దినం తప్పిచ్చి దినం తిప్పేసుకుంట నీల్లు జల్లుకుంట వుండెటోడు.

అట్ల వో రొండు వారాలు మక్కినంక దాంట్లె వో పొగాకు కాడ తీసుకొని పొరసుట్ట సుట్టి గుప్పుగుప్పున పొగ వొదులుకుంట మంచం మీద కూసుంటోడు. మా నాయిన శెయ్యి తీరేమో గని ఆకు బలే పసందుగ వుండేది. అట్ల బోయెటోల్లు యిట్లొచ్చి 'అయా వో ఆకుంటె యెయ్యి' అంటే సాలు మా నాయిన మారాజోలిగ మంచం మీద కూసొని వో కాడ యిసిరేసెటోడు తుర్తిగ.

తర్వాత మా నాయిన యీతాకు సాపల్ల వొర్సగా పేర్సి అండేలు కట్టెటోడు. పది పన్నెండు అండేలు కుప్పేసి కండ్లార జూసుకొని పొడుగ్గా గాలి పీల్సి వొదిలెటోడు సంబూరంగ.

ఎవలన్న బేరగాల్లు వొస్తె యింటికాన్నే అమ్మెటోడు. కొద్దిగొప్ప మాత్తరం బాగ దరొస్తదని బండిమీద యేస్కొని కాల్వకిందికి పోయి అమ్ముకొచ్చెటోడు.

పంట పండించేదాంక మా నాయినకు యాస్ట అనేదే తెల్వకపొయ్యేది. అండేలు కట్టినంక మాత్తరం బలే శికాకు పడెటోడు. 'రెక్కలు దారపోసి పండించింది. సర్కారోని సూపుబడకుంట దాసుకోవాల్సి వొస్తుండె గదా!' అని మా యింటి పక్కన గొల్లోల్ల యిండ్లల్ల ఆడరొండు యీడ రొండు అండేలు దాసెటోడు. ఓ రొండో మూడో మాత్తరం మా యింట్లనే వోమూలకు పెట్టెటోడు.

సరిగ్గ పంట యాల్లకు సర్కారోల్లు వొచ్చెటోల్లు రకం కోసం. నిజానికి ఆల్లు అడిగే రకం కడితే మాకు మిగిలేది బోడ గుండేనంట. అందుకని మా నాయిన అన్నీ దాసి వొకటో రొండో అండేలు యింట్లె వుంచెటోడు.

సర్కారు ఆపీసరు వోడొచ్చినా మా నాయిన యెప్పుడూ బెయపడక పొయ్యేది కాని మా వూరోడే జానికిరాంవులు మా నాయినోలిగనే యిల్లుటం వొచ్చిన బాపతె- ఆపీసరయి వొచ్చిండు. అప్పటి సంది మా నాయిన



యియియిస్తరా దేవుడా యీ ఏంట అని తల బాదుకుంటోడు.

'ఆడు పెద్ద ఆపీసరు గని యెందుకు? మానం మరేద దప్పిన కుక్కల కొడుకు' అని అంటరు ఆయినను తల్సుకొని వూల్లె యెవలైనా. అంత నీచపు నా కొడుకు. పొగాకు ఆపీసరై రైతుల పీక్క తిని మా బాగా సంపాయించిండంట.

ఆని గురించి పదిమందిల మాట్లాడుతుంటే సూడాలె. థూ... యీ బతుకు బతికేనా? అనిపిస్తది.

'ఆడు మనిషా? థూ... పైసకు పుట్టిన నా కొడుకు' అంటరు.

'అబ్బో ఆడా? కోడిగుడ్డుల పచ్చనీలం దొబ్బేరకం' అని వోడంటడు.

'కటీనపు ముండాకొడుకు ఆడు మంచోడైతే కూసున్న ఆడిది యెందుకు లేవదు? థూ... ఆని బతుకుజెడ. ఆని గురించి మాట్లాడకుర పుట్ట గతులుండవ్' అంటరు యిసిగి పోయినోల్లు.

ఇగో అసుంటి జానికిరాంవులు ఆపీసరయి మా వూరి మీదికొచ్చిండు. అందరి ఆయం తెల్సినోడాయె. ఎవలెవలు యెంత పంటేసింద్రు? యెవలికి యెంత పండింది? అని లెక్కలేసెటోడు. ఎవలు యెక్కడ దాసింద్రో కూడా జాడగుంజి రకం కోసం బెయిటికి యెల్లెటోడు.

'పొగాకు పండిస్తె పగాకు ఆయెగదరా దేవుడా! ఈ జానికిరాంవులు గాని సూపుపడి' అని లబోదిబో తల్కాయ కొట్టుకుంటోల్లు. అయినా ముక్కుపిండి వొసులు జేసెటోడు రొండు శేతులు పబ్బుతి బట్టినా.

> **'ఆడు పెద్ద ఆపీసరు గని యెందుకు? మానం మరేద దప్పిన కుక్కల కొడుకు' అని అంటరు ఆయినను తల్సుకొని వూల్లె యెవలైనా. అంత నీచపు నా కొడుకు. పొగాకు ఆపీసరై రైతుల పీక్క తిని మా బాగా సంపాయించిండంట. ఆని గురించి పదిమందిల మాట్లాడుతుంటే సూడాలె. థూ... యీ బతుకు బతికేనా? అనిపిస్తది.**

ఓ యేడాదిపాటు వూల్లె ఆసాములంత తిట్టిన తిట్టు తిట్టకుంట తిట్టి గోడు గోడున యేడ్సింద్రు. మల్లా యేడాదికి మాత్తరం పొగాకు యేస్తందుకు సగమందే ధైర్నం జేసింద్రు. అట్లాంటి మొండి నా కొడుకులల్ల మా నాయిన వొకడు.

సక్కగ మా యింటి ముంగల గుడు గుడు మోటరును ఆపి యింట్లె కొచ్చిండు జానికిరాంవులు. ఉన్న రొండు అండేలకు తుర్తి పడక గొల్లోల్ల యిండ్లల్ల దూరి అన్నీ తీసుకొచ్చి కుప్పేసిండు. మా నాయినను బట్టుకని 'కక్కు పన్నెండొందల రకం' అన్నడు కాకిసూపు సూసుకుంట.

మా నాయిన మొకం చిట్లించుకుంట 'నేను రకం యాడ గద్త?' అన్నడు కట్టెపుల్ల యిర్సినట్టు.

వో... రెచ్చిపోయిన జానికిరాంవులు వొంటికాలు మీద లేసి కాయితం కలం అందుకొని గీకటం మొదలుబెట్టిండు మా నాయిన మీద కేసు.

అయినా మా నాయిన కదలడు మెదలడు. మామ్మ మాత్తరం గజగజ వొణికిపోయింది. జమయినోల్లంత 'కాల్లాయేల్లా పడి అంతోయింతో కట్టు లేకపోతే జేలుకు పంపిస్తడంట' అని గడగడ వొనుక్కుంట చెప్పింద్రు.

అయినా మా నాయిన శెంకం జెయ్యలే. ఇంగ జానికిరాంవులు చలో జేలుకు అంటుంటే మా నాయిన అప్పుడు అందుకొని అన్నడు నాయినా మనిషన్నోడు యిసక్కున సావాలె!

'యెల్మపుట్క పుట్టినవ్ యెందుకురా? మంది సొమ్ము తింటే మాయరోగమొచ్చి సస్తవ్‌రా. వూరోడని సూడకుంట, రెక్కలు ముక్కలు జేసుకొని పండించినమని గూడ జూడకుంట పైసకు పియ్యితిని పొట్టమీద కొడ్తున్నవ్ గదరా! పుట్టగతులుంటాయిరా? ఎందుకురా నియతి లేని బతుకు? రేయ్ వో మాటిను నీ యిస్టం వొచ్చింది గీసుకో. దిక్కులేని కోరుట్ల యేసుకో. అయినా నువ్వు నా యెంటిక కూడా పీకలేవ్ థూ... నీ బతుకుల్ల నా చెప్పు' అని కాండ్రించి వూసిండు.

ఇంట్లెకొచ్చి సుట్టముట్టిచ్చుకొని అప్పుడన్నడు నవ్వుకుంట, బిక్కసచ్చిపోయి సూస్తున్న మా అమ్మతోని.

'నల్లగొండ కర్నం పంతులు జెప్పిండు. రకం మాఫీ జేసిందంట సర్కారు. ఈ నా కొడుకు లొట్టలేసుకుందామని వొసులు జేస్తుండు. అది తెలిసే...'

●

## 9 నా రాధకు...



పండువెన్నెల
పిండారబోసి,
వనలక్ష్మి
నిండుగా పూచి,
యమునా నదీ తీరాన
పిల్లగాలులు చల్లగా వీచగ...
నేను....,
నా రాధ ముద్దు చేతులు ముద్దాడగా,
ముంచుకొచ్చిన చలివిందులో
రాసక్రీడల్లో రాధతో
మమేకమైనపుడు...
ముజ్జగములు పరవశించె,
ప్రేమసాగరముప్పొంగె,
అదే...
ప్రేమ లోకానికి
పర్వదినము-

***

అమృతం కురిసిన వాన
ఏ దేవతో కురిపిస్తే
నాకెందుకు?
ఈ దోసెళ్ళు
నీ ప్రేమజల్లు తో
తడిసినా చాలు-

- చల్లా రామక్రిష్ణారెడ్డి

